ఉత్సాహంగా బడిబాట

- పాఠశాలలకు హాజరైన విద్యార్థులు
- తొలి రోజు కొన్ని పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ

నూజివీడు: వేసవి సెలవుల అనంతరం నియోజకవర్గంలో గురువారం బడిగంట మోగింది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి ఈనెల 12వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన సెలవులు ముగియడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. పాఠశాలల బస్సుల్లో, ఆటోల్లో, తమ సొంత వాహనాలపై తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల భారాన్ని భరించలేని పేద వర్గాల ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు.

● **ఇబ్రహీంపట్నం:** మండల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. ఐదు జెడ్పీ పాఠశాలలు, 32 ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. మామిడి తోరణాలు, ముగ్గులతో పాఠశాలలను అలంకరించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యా కానుక కిట్లు మండల విద్యా శాఖ పాఠశాలలకు తరలించినప్పటికీ తొలి రోజు విద్యార్థులకు అందజేయకపోవడం గమనార్హం. తొలిరోజు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఉపాధ్యాయులు అడుగులు వేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

స్వల్పంగా హాజరు..

తిరువూరు: వేసవి సెలవుల అనంతరం గురువారం తిరువూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను పునఃప్రారంభించారు. తొలిరోజు పాఠశాలలకు స్వల్ప సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. తిరువూరు పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని ముష్టికుంట్ల, మునుకుళ్ల, గానుగపాడు, మల్లేల, కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గత మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన ఫలితాలను తెలుపుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల చేర్పింపునకు ప్రచారం నిర్వహించారు.

● **గంపలగూడెం:** మండలంలో గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నామమాత్రంగా హాజరయ్యారు. మండలంలోని 54 ఎలిమెంటరీ పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 ఉన్నత పాఠశాలల్లో 4,185 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా అత్యల్పంగా హాజరయ్యారు. విద్యార్థులకు హాజరు వేసి మధ్యాహ్నం భోజనం అమలు చేసినట్లు ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు తెలిపారు. ఉపాధ్యాయులు మాత్రం నూరుశాతం హాజరయ్యారని ఎంఈఓ వివరించారు.


కొత్తచిలుకూరు ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఆగిరిపల్లి హైస్కూల్ ఆవరణలో చెట్ల కింద కూర్చున్న విద్యార్థులు


చాట్రాయి మండలం జనార్ధనవరంలోని ప్రాథమిక పాఠశాలలో ఆడుకుంటున్న పిల్లలు


గంపలగూడెంలో హైస్కూల్‌కు ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులు


దొనబండ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ వర్కర్


కొండపల్లి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం స్వీకరిస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన



నూజివీడు: ట్రిపుల్ ఐటీలో 2010–14 మధ్య కాలంలో ఉద్యోగంలో చేరిన అధ్యాపకులకు గత ఆరేళ్లుగా జీతాలు పెంచకపోవడం దారుణమని ట్రిపుల్ ఐటీకి చెందిన పలువురు అధ్యాపకులు అన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ గురువారం ట్రిపుల్ ఐటీలో వారు ఆందోళనకు దిగారు. ఐఐటీలలోను, సెంట్రల్ యూనివర్సిటీల నుంచి అధ్యాపకులను ఎంపిక చేసి జీతాల పెంపుపై మాయమాటలు చెప్తూ మభ్యపెట్టారని వారు వాపోయారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి ల్యాబ్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లకు వేతనాలను పెంచాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించి వేతనాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలోని పాటి మీద ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పట్టణంలోని కేవీ టెక్స్‌టైల్స్ అధినేత కేవీ నరసింహారావు, కూరపాటి గోపాల్ రూ.లక్షా 11 వేల చొప్పున, సూరిశెట్టి నాగేశ్వరరావు రూ.10,116 విరాళాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, సంకా రాంబాబు, గుడిమెట్ల చిన్న వెంకటేశ్వరరావు, కంచి చిన్న అంజయ్య, నాళ్లా ఆంజనేయులు, చిన్ని శ్రీనాథ్, అర్చకులు మరింగంటి శ్రీనివాసరావు, విఠలాచార్య పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు సహకరించాలి



మైలవరం: ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తేజస్విని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సతీష్‌బాబు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన వేసవి తాగునీటి చలివేంద్రం ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభంలో డాక్టర్ సతీష్‌బాబు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో తాగునీటితో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు ఐనీడ్స్ పుల్లారెడ్డి, ఎ. చంద్రశేఖర్, శివరామిరెడ్డి, కె. శివ, మనోహర్, మురళీకృష్ణ, బి. శివకుమార్ రెడ్డి, బి. శ్రీనివాస్‌రెడ్డి, భవ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పునీత అంథోని విగ్రహం ఊరేగింపు



మైలవరం: మైలవరం ఆర్‌సీఎం చర్చి విచారణ దేవాలయ పరిధిలో పునీత అద్భుతాల అంథోని పండుగ గురువారం జరిగింది. స్థానిక శాంతినగర్ వీధుల్లో తేరు ప్రదక్షిణగా జపమాల, పాటలతో ఆంథోని విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ ప్రసంగిస్తూ మహా పునీతుని ప్రార్థించే వారికి దేవుని దీవెనలతోపాటు మహిమలు, అద్భుతాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉపాధ్యాయ ఉపదేశకులు, మరియ దళ సభ్యులు, 16 సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రొట్టెలను పంపిణీ చేశారు.

కేవీఆర్‌లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు జూనియర్ కళాశాల మంజూరైందని హెచ్‌ఎం కె.జలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25కు సంబంధించి ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈఏడాది ఎంపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం కోరారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంఈఓ నరసింహారావు

గంపలగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు గురువారం సరఫరా చేశారు. వీటిని గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిల్వ చేశారు. పాఠశాలల వారీగా వీటి సరఫరాను ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు ప్రారంభించారు. మండలంలోని 79 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 4,185 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఆయా తరగతులకు చెందిన 36,179 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా మొదటి విడతగా 32,914 పుస్తకాలు సరఫరా అయ్యాయని ఎంఈఓ తెలిపారు. సంబంధిత పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే విద్యార్థులకు అందజేయాలన్నారు. ఎంఐఎస్ శ్రీను, సీఆర్పీలు గోపాలకృష్ణ, అచ్చారావు, అచ్చమ్మ, నరసింహారావు, సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి, డ్రెయిన్లకు మరమ్మతులు

మునునూరు: కొర్లగుంట శివారు సింహాద్రిపురంలో గుంటలు పడిన రహదారికి మరమ్మతులు చేయించి డ్రెయినేజీల్లో తూరలు వేయించారు. నూజివీడు–ఏలూరు ప్రధాన రహదారిలో సింహాద్రిపురం వద్ద డ్రెయినేజీలు పూడిపోయి, రహదారిపై నీరు నిలవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో గురువారం సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణ డ్రెయినేజీల్లో తూరలు వేయించి రహదారి పునరుద్ధరణ పనులు చేయించారు.

ప్రకృతి వ్యవసాయ వస్తువుల స్టోర్ ప్రారంభం



ఆగిరిపల్లి : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలు, ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఏఓ అబ్దుల్ సలాం అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో ప్రకృతి సేంద్రియ దుకాణాన్ని వారు ప్రారంభించారు. డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్ మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు లేకుండా పండించే ప్రకృతి సేంద్రియ ఆహార ఉత్పత్తులు తీసుకోవడం ఎంతో మేలని వివరించారు. కార్యక్రమంలో ఏపీ సీఎస్ఎఫ్ మండల ఇన్‌చార్జి ఆల్ఫాన్సా రాణి, సిబ్బంది బోనం శ్రీనివాసరావు, లక్ష్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

18న వాహనాల వేలం

జగ్గయ్యపేట అర్బన్: మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18వ తేదీ ఉదయం పదిగంటలకు వేలం నిర్వహిస్తామని జగ్గయ్యపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి గురువారం తెలిపారు. తొర్రగుంటపాలెం 14వ వీధిలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసు పక్కనున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద ఈ వేలం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తిగలవారు ఆయా వివరాలకు ఎస్‌ఈబీ సీఐ సెల్ నెంబర్లు 94409 02461, 94908 74538లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం సత్యనారాయణ

నూజివీడు: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో గురువారం క్లస్టర్ కో–ఆర్డినేటర్ కాకిలేటి శ్యాంబాబు ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులతో పాఠశాల ఆవరణలో మొక్కలను నాటించారు. ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. సత్యనారాయణ మాట్లాడుతూ చెట్లను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల రాను రాను వాతావరణంలో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి, కార్బన్ డై ఆక్సైడ్ శాతం పెరిగి వాతావరణం వేడెక్కి తద్వారా భూగోళం కూడా వేడెక్కుతోందన్నారు. దీంతో అనేక దుష్ఫలితాలు సంభవించి మానవుడితో పాటు జీవులన్నీ నాశనమవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఒక చెట్టు నరకాల్సి వస్తే కనీసం నాలుగు మొక్కలనైనా నాటాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటి సంరక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి..

నూజివీడు: చెట్లను విచ్చలవిడిగా నరకడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ నెలకొంటోందని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గురువారం మొక్కలు నాటారు. హెచ్‌ఎం మాట్లాడుతూ చెట్లు నరకడం, కాలుష్య కారకాలు విచ్చలవిడిగా వాతావరణంలోకి చేరుతుండటం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే ప్రజలు భూమిపై జీవనం సాగించగలుగుతారన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేసవి దుక్కులు ఎంతో మేలు

మైలవరం: వేసవి దుక్కులు రైతులకు ఎంతో మేలు చేస్తాయని జిల్లా శిక్షణా కేంద్రం ఉప సంచాలకులు టి. మాధవీలత అన్నారు. మైలవరం రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు ఆధ్వర్యంలో రైతులకు, ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో చేయవలసిన కార్యక్రమాలను వివరించారు. వేసవి దుక్కులు లోతుగా దున్నుకోవడం వలన భూమి లోపలి పొరల్లోని క్రిములు పైకి వస్తాయని, వర్షం నీరు భూమి అడుగుకు చేరి పంటలకు బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. రైతులు ముందుగా మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. మట్టి నమూనాను బట్టి ఎరువులు వినియోగించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డులో చూపించిన ఎరువుల మోతాదును, అందులో ఉన్న భూ భౌతిక రసాయన పరిస్థితులు, దానిని ఏ విధంగా బాగు చేయవచ్చు, దాని ద్వారా సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని వివరించారు. మైలవరం ఆర్‌బీకేల్లో వరి విత్తనాలు ఎంటీయూ–1061, బీపీటీ–5204 అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మోనీషా, మండల వ్యవసాయాధికారి కె. సంధ్యారాణి, మైలవరం వీఏఏ ఐ.హనస్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న మాధవీలత

గంపలగూడెంలో భారీ వర్షం

పిడుగుపాటుకు నాలుగు గొర్రెలు మృతి

గంపలగూడెం: మండలంలో గురువారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం పడింది. పలు రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గడచిన కొన్ని రోజులుగా వేసవి ఉష్ణతాపంతో అల్లాడిపోతున్న ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఊరటచెందారు. పిడుగుపాటుకు మండలంలోని కనుమూరులో రైతు సుబ్బారావుకు చెందిన నాలుగు గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల మంద ఆ సమయంలో మామిడి తోటలో ఉండగా పిడుగు పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

● **విస్సన్నపేట:** మండలంలో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నెలకొరిగాయి. మధ్యాహ్నం నుంచి కురిసిన ఎడతెరపి లేని వర్షంతో చెట్లు నెలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది విద్యుత్ లైన్లపై పడిన చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


గంపలగూడెం మండలం కనుమూరులో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

దేవస్థానం ప్రాంగణంలో రాజకీయ బ్యానర్లపై భక్తుల ఆగ్రహం

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణం కనకదుర్గనగర్‌లో రాజకీయాలకు సంబంధించిన బ్యానర్ల ఏర్పాటుపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో ఇంద్రకీలాద్రి దిగువనున్న కనకదుర్గనగర్‌లో గల క్యాంటీన్‌కు ఒక వైపు తెలుగుదేశం పార్టీకి చెందిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీకి చెందిన క్యాంటీన్ యజమాని అధికారంలోకి వచ్చాం కదా అని పవిత్రమైన అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొలిటికల్ బ్యానర్లను పెడితే ఆలయ అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇది మంచి సంప్రదాయం కాదని, కనకదుర్గనగర్‌లో షాపులున్నవారు తమతమ దుకాణాల ముందు తాము అభిమానించే రాజకీయ పార్టీల బ్యానర్లను ఏర్పాటు చేసుకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దేవాలయ ప్రాంగణ పవిత్రతను కాపాడే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


కనకదుర్గ నగర్‌లోని క్యాంటీన్‌కు ఏర్పాటు చేసిన టీడీపీ బ్యానర్లు

వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత దోహదం


శ్రీనివాస కల్యాణం రూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

శ్రీవిద్యాపీఠాధిపతి బాల స్వామీజి

భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతను ప్రగతి పథంలోకి నడిపించే మార్గదర్శి శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించిన భగవద్గీత అని శ్రీవిద్యాపీఠాధిపతి (తెనాలి) శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజి) అన్నారు. భవానీపురానికి చెందిన శ్రీ గోవిందనామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గొల్లపూడి బైపాస్ రహదారిలో గల శ్రీరస్తు కల్యాణ మండపంలో నిర్వహించిన భగవద్గీత ప్రగతిపథం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భగవద్గీత శ్లోక పఠనం పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బాల స్వామీజి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విజయావకాశాలను చూపించే దర్శిని భగవద్గీత అని వివరించారు.

దేవదాయ ధర్మదాయ శాఖ ధర్మప్రచార పరిషత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి మాట్లాడుతూ గోవిందనామ ప్రచారాన్ని ఒక సేవా కార్యక్రమంగా ఎంచుకున్న టి.సునీతా, మధుసూదన్ దంపతులు అభినందనీయులన్నారు. ముఖ్యంగా విద్యార్థులతో భగవద్గీతలోని శ్లోకాలను పఠింపచేస్తూ వారిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడం శుభపరిణామమని తెలిపారు. ధనుర్మాసంలో రాష్ట్రంలోని శ్రీవారి ఆలయాలకు తులసి మాలలు అందిస్తున్న సునీతా మధుసూదన్ దంపతులకు శ్రీనివాసుని అనుగ్రహం లభిస్తుందని అన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడిగా శ్రీధర్

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడిగా తిరుమలశెట్టి శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం జనరల్ బాడీ సమావేశం లయన్ పూర్వ గవర్నర్ ఎస్వీఎన్ నివృతరావు అధ్యక్షతన గురువారం ఆయన కార్యాలయంలో జరిగింది. నివృతరావు మాట్లాడుతూ లయనిజమ్ అంటే సేవ అని, సేవ చేయడం ద్వారానే గుర్తింపు వస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని లయన్ నివృతరావు అభినందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం సెక్రటరీగా చనుమోలు నాగభూషణం, ట్రెజరర్‌గా కొల్లిపర నాగప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లయన్స్ పూర్వ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, సభ్యులు కోట పుల్లారెడ్డి, సీహెచ్ బాలగోపాలరెడ్డి, లేళ్ల ఏడుకొండలు, తిమ్మన దినేష్‌బాబు, తాడేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

16న సంగీత విభావరి

నూజివీడు: గాన గంధర్వ దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకొని నూజివీడు కళావేదిక, శ్రీ సత్య నృత్య సంగీత కళాశాల, రాగసుధ మెలోడీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న సంగీత విభావరి జరుగుతుందని నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. స్థానిక బ్యాంక్ స్ట్రీట్ సమీపంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు నిర్వహించనున్న సంగీత విభావరిలో ఔత్సాహిక గాయనీ గాయకులు ఎస్పీ బాలు పాడిన గీతాలను ఆలపిస్తారన్నారు. కార్యక్రమంలో సంగీత అభిమానులు, ఎస్పీ బాలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

18న భూముల కౌలు వేలం

నందిగామ టౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలకు చెందిన భూములకు టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తామని ఈఓలు ఫణికుమార్, గంగాధర్ గురువారం తెలిపారు. మండలంలోని పెద్దవరం నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన 12.60 ఎకరాలకు, చెన్నకేశవ స్వామి వారి ఆలయానికి చెందిన 14 ఎకరాల భూమికి చెన్నకేశవస్వామి వారి ఆలయ ఆవరణలో ఈనెల 18 న ఉదయం 10 గంటలకు కౌలు వేలం నిర్వహిస్తామని వివరించారు. లింగాలపాడులోని లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు తక్కెళ్లపాడు, లింగాలపాడు గ్రామాల సమీపంలోని ఆలయానికి చెందిన 37.24 ఎకరాల భూమికి కౌలు వేలం నిర్వహిస్తామన్నారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు మాగల్లులోని మదన గోపాలస్వామి వారి ఆలయ ఆవరణలో ఆలయానికి చెందిన 29.64 ఎకరాలకు కౌలు వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తిగల రైతులు కౌలువేలంలో పాల్గొనాలని ఈఓలు కోరారు.